

ఎలుకల నిర్మూలన సామూహికంగా చేపట్టాలి

జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - మొగల్తూరు

రైతులు ఎలుకల నిర్మూలన సామూహికంగా చేపడితే ప్రయోజనం ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు సూచించారు. రామన్నపాలెంలోని ఒకటో సచివాలయంలో ఎలుకల నిర్మూలన మందును రైతులకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు ముందుగా గుర్తించిన ఎలుక బొరియల వద్ద మందులు ఉంచాలన్నారు. రైతులు ఏకకాలంలో ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టాలన్నారు. దీంతో అధిక దిగుబడితోపాటు లాభాలు సాధించొచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం జిల్లా అధికారి బాల, మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీం, పలువురు రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రబీ ధాన్యం.. కొనుగోలుకు సన్నాహాలు..!

ఏప్రిల్ 1 నుంచి ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక

సంచుల కొరత రాకుండా ముందస్తు కసరత్తు

రెండు జిల్లాల్లో దాదాపు 3 లక్షల ఎకరాల్లో వరిసాగు

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో జిల్లాకు మంచి పేరు

కొనుగోలు కేంద్రాలు సకాలంలో ప్రారంభిస్తేనే రైతులకు మేలు

ఇంకా రైతుల వద్ద ఖరీఫ్ ధాన్యం 3,500 మెట్రిక్ టన్నులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



రబీ ధాన్యం కొనుగోలు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభించాలనే ఆలోచనతో అధికారులు ముందుకు సాగుతున్నారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులు నిమగ్నమయ్యారు. ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఇప్పటికే ధాన్యం కొనుగోలుకు సంబంధించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో జిల్లా అధికారులకు మంచి గుర్తింపు వచ్చింది. రబీలోనూ అంతే పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు సాగించాలని పౌర సరఫరాల శాఖాధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఏలూరు జిల్లాలో 70 వేలు, పశ్చిమగోదావరి జిల్లాలో 2.25 లక్షల ఎకరాలు కలిపి మొత్తంగా సుమారు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. రెండు జిల్లాలవ్యాప్తంగా దాదాపు పది లక్షల మెట్రిక్ టన్నుల వరకూ ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉంది. జిల్లా రైతాంగానికి రబీ సాగు అత్యంత ముఖ్యమైంది. దిగుబడులు ఎక్కువగా వస్తాయనే ఆశ రైతుల్లో ఉంటుంది. రబీ ధాన్యం కొనుగోలులో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే రైతులు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి రానుంది. ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు సంచుల కొరత, రవాణా ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా ప్రారంభిస్తే ముందస్తుగా వచ్చే పంటను దళారులు అయినకాడికి కొనుగోలు చేసే పరిస్థితి ఉంటుంది. దీంతో రైతులకు మద్దతు ధర దక్కక తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఏర్పడనుంది. ధాన్యం కొనుగోలు ముందుగా ప్రారంభించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. రబీ ధాన్యం కొనుగోలుకు ఏలూరు జిల్లాలో 50 లక్షల వరకూ గోనె సంచులు అవసరం ఉంటుందనే అంచనాతో అధికారులు సిద్ధం చేస్తున్నారు. పశ్చిమలోనూ అదేవిధంగా ముందుకు సాగుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం కొనుగోలులో రైతులు ఎదుర్కొన్న సమస్యలను గుర్తించిన అధికారులు ఖరీఫ్‌లో తగు జాగ్రత్తలు తీసుకున్నారు. రబీలో మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ఖరీఫ్ ధాన్యం రవాణా వాహనాలకు సంబంధించి సొమ్ము చెల్లింపుల్లో కొంత ఆలస్యం కావడంతో వాహనాల యజమానుల్లో అసంతృప్తి నెలకొంది. రబీలో అటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది. తేమశాతం ఇబ్బందులపైన రబీలోనూ జాగ్రత్తలు తీసుకోవాలి. వాతావరణం సవ్యంగా ఉంటే తేమ ఇబ్బందులు ఉండవు. ఏమైనా మార్పులుంటే తేమ ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై సానుకూలంగా

ప్రభుత్వం ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై సానుకూలంగా ముందుకు సాగుతోంది. ఇప్పటికీ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కొనసాగుతోంది. దెందులూరు, పెదపాడు వంటి మండలాల్లో ఇంకా కుప్పల రూపంలో ఖరీఫ్ ధాన్యం ఉండిపోయింది. రెండు మండలాల్లో దాదాపు 3,500 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ ధాన్యం సైతం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసిన తర్వాతే ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగుస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇది రైతులకు ఊరటనిచ్చే అంశంగా చెప్పొచ్చు. ఖరీఫ్‌కు సంబంధించిన ధాన్యం సొమ్ము సైతం రైతులకు పూర్తిస్థాయిలో జమ చేసినట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు చెబుతున్నారు.



రైతులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

అందరికీ ఆమోదయోగ్యంగా రీసర్వే

కలెక్టర్ సిహెచ్.నాగరాణి

ప్రజాశక్తి - పాలకోడేరు

రైతులకు ఆమోదయోగ్యమైన భూ రీసర్వే చేపట్టేందుకే గ్రామ సభలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని శృంగవృక్షంలో భూ రీసర్వేలో లోటుపాట్లను తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆమె సంబంధిత అధికారులతో కలిసి పాల్గొన్నారు. రైతులతోపాటు కలెక్టర్ కూడా నేలమీద పరిచిన బరకంపై కూర్చుని రైతుల సమస్యలు, సూచనలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి రైతులతో మాట్లాడుతూ రైతులకు భూసమస్యలు లేకుండా చక్కని పరిష్కార మార్గాన్ని అందించేందుకే భూముల రీసర్వేను చేపట్టారన్నారు. రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించి అపోహలకు తావులేని వాస్తవ రికార్డులను రూపొందించడమే లక్ష్యమన్నారు. ప్రతి రైతూ ఎంతో కష్టపడి సంపాదించుకున్న భూములు వాస్తవ కొలతలతో వారికి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఫలానా తేదీ, ఫలానా సమయంలో మీ భూమిని రీసర్వే చేయడానికి వస్తున్నామని ముందుగానే నోటీసు జారీ చేసి వారి సమక్షంలోనే భూమిని సర్వే చేయమని ఆదేశించిందన్నారు. ప్రతి మండలంలోని ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి తొలుత రీసర్వేను ప్రారంభించామని, శృంగవృక్షం గ్రామంలో గత 15 రోజులుగా రీసర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. వాస్తవ భూమి లెక్కలు నిర్ధారించుకున్న అనంతరం వ్యక్తిగతంగా భూముల కొలతలను రైతుల సమక్షంలోనే నిర్వహిస్తారని తెలిపారు. రీసర్వేలో ఉత్పన్నమయ్యే సమస్యలను తక్షణమే పరిష్కారం చూపే దిశగా ప్రతి మండలానికీ ఒక సర్వే డిప్యూటీ తహశీల్దార్‌నూ నియమించామన్నారు. జిల్లాలోని 20 మండలాల్లో 20 గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి రీసర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. 20 గ్రామాల్లో 37 వేల ఎకరాలు సర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 22 వేల ఎకరాలు సర్వే పూర్తి చేశారని అన్నారు. 24 వేల మంది రైతులు ఉండగా 15 వేల మంది రైతులకు ఇప్పటికే నోటీసులు అందజేసి సర్వేకు హాజరు కావాలని కోరినట్లు తెలిపారు. వివాదరహిత భూములను పొందేందుకు రైతులు రీసర్వేకు హాజరై సర్వే బృందానికి సహకరించాలని కలెక్టర్ కోరారు. తొలుత పలువురు రైతులు రీసర్వేలో భాగంగా తలెత్తుతున్న సమస్యలను, సందేహాలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సందేహాలను నివృత్తి చేసి, సమస్యలు లేకుండా రీసర్వే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామసభలో భీమవరం ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహశీల్దార్ ఎన్‌వి.విజయలక్ష్మి, సర్పంచి జంగం సూరిబాబు, ఎంపిటిసి ఎస్.సత్యకృష్ణ, స్థానిక నాయకులు కలిదిండి కృష్ణంరాజు, రామకృష్ణంరాజు, సర్వే డిటిలు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ బకాయిలను విడుదల చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

ఇంటి నిర్మాణ బకాయిలను తక్షణం విడుదల చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. స్థానిక మెంటేవారితోటలోని సుందరయ్య భవనంలో ఆ పార్టీ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతకాయల బాబూరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ గత టిడిపి ప్రభుత్వ హయాంలో ఇళ్లు కట్టుకున్న పేదలకు ప్రభుత్వం విడుదల చేయాల్సిన బకాయిలను ఇంతవరకు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. కోట్లాది రూపాయలు నిలిచిపోవడం వల్ల అప్పు చేసి ఇళ్లు కట్టిన వారు వడ్డీలు చెల్లించలేని దుస్థితి దాపురించిందన్నారు. వైసిపి ప్రభుత్వం వారి పట్ల నిర్లక్ష్యంగా వహరించగా, కూటమి ప్రభుత్వం వచ్చాక బకాయిలిస్తారనుకుంటే నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం ఆ బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, కౌరు పెద్దిరాజు, బి.వాసుదేవరావు, పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, ముచ్చర్ల త్రిమూర్తులు, ఎ.అజయకుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోపాలన్

ఎంఎల్‌సి ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు ఇవే

రిసెప్షన్ సెంటర్ కం ఇంటర్‌మీడియేటరీ స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు - రిటర్నింగ్ అధికారి కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణకు సంబంధించి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, రిసెప్షన్ సెంటర్ కం ఇంటర్‌మీడియేటరీ, స్ట్రాంగ్‌రూమ్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 26న ఆయా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా ఎన్నికల పోలింగ్ సామాగ్రిని ఎన్నికల సిబ్బందికి అందజేస్తారు. అదే విధంగా పోలింగ్ పూర్తయిన అనంతరం ఎన్నికల సామగ్రి చేర్చేందుకు ఆయా ప్రాంతాల్లో రిసెప్షన్ సెంటర్ కం ఇంటర్‌మీడియేటరీ స్ట్రాంగ్‌రూమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. కాకినాడ జిల్లాకు సంబంధించి కాకినాడ కలెక్టరేట్‌లో, ఎఎస్ఆర్ జిల్లాకు సంబంధించి రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో, రామచంద్రాపురం విఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో, కొత్తపేట ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో, పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి భీమవరం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలు, తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలోను, ఏలూరు జిల్లాకు సంబంధించి వట్లూరులోని సిఆర్‌రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో, జంగారెడ్డిగూడెంలోని ఆర్‌డిఒ కార్యాలయంలో ఇంటర్‌మీడియేటరీ స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా జిల్లాల్లో ఇంటర్‌మీడియేటరీ స్ట్రాంగ్ రూమ్‌లకు చేరిన బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రిని ఏలూరు జిల్లా వట్లూరులోని సిఆర్‌రెడ్డి కళాశాలకు తరలిస్తారు.

మార్చి మూడో తేదీన ఓట్ల లెక్కింపునకు ఏలూరు జిల్లా వట్లూరులోని సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలు

కాకినాడ జిల్లా : కాకినాడ ఎంసి.లారిన్ హైస్కూల్, పెద్దాపురం ఆర్‌డిఒ కార్యాలయం

ఎఎస్ఆర్ జిల్లా: రంపచోడవరం సబ్ కలెక్టర్ ఆఫీసు, చింతూరు సబ్ కలెక్టర్ కార్యాలయం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా: అమలాపురం అగ్రహారంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, రామచంద్రాపురంలోని విఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల, కొత్తపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల

పశ్చిమగోదావరి జిల్లా: భీమవరం, నర్సాపురం, తాడేపల్లిగూడెం ఆర్‌డిఒ కార్యాలయాలు

తూర్పుగోదావరి జిల్లా: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల

ఏలూరు జిల్లా: ఏలూరు కలెక్టరేట్ సమీపంలోని గిరిజన భవన్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం

ప్రభుత్వ భూమిని సర్వే చేయించాలి

దళితులకు శ్మశాన స్థలంగా కేటాయించాలి ఆర్‌డిఒకు దళిత నేతల వినతి

ప్రజాశక్తి - నరసాపురం

యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో ఏటిగట్టు దిగువున ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే చేయించి గ్రామంలోని దళితులకు శ్మశాన స్థలంగా కేటాయించాలని కోరుతూ శుక్రవారం దళిత నాయకుల ఆధ్వర్యంలో ఆర్‌డిఒ దాసిరాజుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు కానేటి బాలరాజు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్ మాట్లాడుతూ చించినాడలో ఎస్‌సిలకు సంబంధించి పెదపేట, ఆర్లపాడు, విప్పర్తిపేట, అరుంధతి పేటకు చెందిన సుమారు 600 కుటుంబాలు ఉన్నాయని, ఎవరైనా చనిపోతే పూడ్చిపెట్టేందుకు శ్మశానం లేక ఏటిగట్టు అంచున ఖననం చేయాల్సిన దుర్భర పరిస్థితి నెలకొందని తెలిపారు. గత 100 ఏళ్లుగా ఏటి గట్టు దిగువున ఉన్న గుణ్ణం గుంట పోరంబోకు భూమి 69 సెంట్ల స్థలాన్ని శ్మశానంగా ఉపయోగించుకుంటున్నామన్నారు. అయితే కొంతకాలం కిందట పక్క సరిహద్దుదారుడైన ఓ భూస్వామి తప్పుడు పత్రాలు సృష్టించి శ్మశాన స్థలాన్ని కోర్టు ద్వారా స్వాధీనం చేసుకున్నాడని తెలిపారు. అప్పటి నుంచి దళితులకు శ్మశానం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం గ్రామంలో ప్రభుత్వ రికార్డుల ప్రకారం ఏటిగట్టు దిగువున నాలుగు తూములను ఆనుకొని 72 సెంట్ల శ్మశాన స్థలం ఉన్నప్పటికీ అది పక్క సరిహద్దుదారులైన రైతుల ఆక్రమణలో ఉన్నందున ఆ భూమిని వెంటనే సర్వే చేయించి దళితులకు కేటాయించాలన్నారు. అదేవిధంగా గుణ్ణం గుంట పోరంబోకు 69 సెంట్లు, మోహన కృష్ణంరాజు తోటలో ఉన్న 27 సెంట్లు, పాత ఏటిగట్టుకు ఆనుకొని మరో 80 సెంట్ల ప్రభుత్వ భూమిని సర్వే చేయించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా 72 సెంట్ల శ్మశాన భూమికి ఆనుకొని రైతులు అక్రమంగా రొయ్యల చెరువు తవ్వేస్తున్నారని, ఆ పనులను వెంటనే ఆపాలని తెలిపారు. స్పందించిన ఆర్‌డిఒ దాసిరాజు యలమంచిలి తహశీల్దార్‌తో ఫోన్లో మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వ భూమిని సర్వే చేయించి రక్షణ కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ఎం.ఆంజనేయులు, టి.వెంకటేశ్వరరావు, పల్లేరు వెంకటస్వామి, తాడి ఉదయ్, విప్పర్తి యెహెూషువ, ముస్కుడి విజయకుమార్, భారతుల పద్మరాజు, ఆకుమర్తి జోసెఫ్, కోరం వెంకటేశ్వరరావు, విప్పర్తి గణపతి పాల్గొన్నారు.



ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న దళిత నాయకులు




ప్రచారం చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు ఉపాధ్యాయులు

పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని ప్రచారం

ప్రజాశక్తి - గణపవరం

గ్రామీణ పేదల, రైతుల, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల సమస్యలు శాసనమండలిలో ప్రస్తావించేందుకు, ప్రజా సమస్యల పరిష్కారానికి పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి దిడ్ల వీరరాఘవులును గెలిపించాలని ఎపి రైతుసంఘం సీనియర్ నేత కవల వెంకటేశ్వరరావు కోరారు. శుక్రవారం జల్లికొమ్మరలో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు మండలాధ్యక్షులు ఎం.పెంటారావు మాట్లాడుతూ వీరరాఘవులును గెలిపించుకుంటే పెద్దల సభలో ప్రజల గొంతుకగా ఉంటారన్నారు. సచివాలయ ఉద్యోగులను, పట్టభద్రులను కలిసి వీరరాఘవులుకు ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేయాలని కోరారు.



	Mother/ Husband	(Place of Ordinary Residence)	Qualification	DOB/Age as on qualifying Date	Male/ Female /Third gender	EPIC Number of AC (if any)	Photo of The Elector
565 VICTOR BABU CHITTURI విక్టర్ బాబు చిట్టూరి	SUNDARA RAO CHITTURI సుందర రావు చిట్టూరి	16-12/3, PEDAPETA, UNDI 16-12/3, పెదపేట, ఉండి	DEGREE	15/08/1976	M	RCU1408483	
566 KRUPA HEPSIBAH CHITTURI కృపా హెప్సిబ చిట్టూరి	VICTOR BABU CHITTURI విక్టర్ బాబు చిట్టూరి	16-12/3, PEDAPETA, UNDI 16-12/3, పెదపేట, ఉండి	DEGREE	08/07/1975	F	BTC3291176	
567 VICTOR BABU CHITTURI విక్టర్ BABU చిట్టూరి	SUNDARA RAO CHITTURI సుందర రావు చిట్టూరి	16-12/3, OPP ZP HIGH SCHOOL, UNDI 16-12/3, జిల్లా పరిషత్ హై స్కూల్ ఎదురుగా, ఉండి	BA BE D	15/08/1976	M	rcu1408483	
568 KRUPA HESIBAH SAKILAY కృప హెప్సిబ సకిలే	VICHTOR BABU CHITTURI విక్టర్ బాబు చిట్టూరి	16-12/3, OPP ZP HIGH SCHOOL, UNDI 16-12/3, జిల్లా పరిషత్ హై స్కూల్	B SC B ED	08/07/1975	F	btc3291176	

ఒకే పేరుతో రెండేసి ఓట్లు, ఫొటోలు ఒకటే

ఒక్కొక్కరికి రెండేసి ఓట్లు

తప్పులతడకగా ఎంఎల్‌సి ఓటర్ల జాబితా

ప్రజాశక్తి - ఉండి

ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి మండలంలో 1532 ఓట్లు ఉన్నాయి. అయితే జాబితా పరిశీలిస్తే ఒక్కో ఓటరుకు రెండు, మూడు ఓట్లు ఉండడం అందరినీ విస్మయానికి గురి చేసింది. ఓటర్ జాబితా తప్పుల తడకగా ఉండటంతో మండలంలో అసలు ఓటర్ల సంఖ్య ప్రశ్నార్థకంగా మారింది. మొదట విడుదల చేసిన ఓటర్ల జాబితాలో ఇదేవిధంగా డబుల్ ఎంట్రీ ఉండడంతో అధికారులను వివరణ అడగగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండింటిలో నమోదు చేయించుకున్నవి డబుల్ ఎంట్రీ అయ్యాయని తెలిపారు. తుది జాబితాలో ఈ తప్పులు ఉండవని అప్పుడు అధికారులు తెలిపినా తుది జాబితాలోనూ ఒక్కో పేరున రెండేసి ఓట్లు దర్శనమిచ్చాయి. మండలంలో ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి రెండు పోలింగ్ బూత్‌లు ఉండగా 382వ నెంబర్ పోలింగ్ బూత్‌కు సంబంధించి 784 ఓట్లు, 383వ నెంబర్ పోలింగ్ బూత్‌కు సంబంధించి 748 ఓట్లు ఉన్నట్లు ఉండి ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ రత్నకుమార్ తెలిపారు.

వైద్య సేవల్లో పశ్చిమకు మొదటి స్థానం

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో అందజేస్తున్న సేవలు, పాటిస్తున్న నాణ్యతా ప్రమాణాలకు గాను పశ్చిమగోదావరి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో 34 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయని, వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది సేవలందిస్తున్నారని తెలిపారు. వీరితోపాటు ప్రతి ఆరోగ్య కేంద్రంలో ముగ్గురు స్టాఫ్ నర్సులు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ల్యాబ్ టెస్టులు, ఫార్మసీ, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్ మొదలగు అన్ని మౌలిక సదుపాయాలూ అందుబాటులో ఉన్నాయన్నారు. రోగులకు ప్రాథమిక స్థాయిలో అవసరమయ్యే అన్ని రకాల మందులు, రక్త పరీక్షలు ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గర్భిణులకు వైద్య సేవలు, టీకాలు, సాధారణ ప్రసవాలు నిర్వహించడం, బాలింత సేవలతో పాటు అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుండి 16 ఏళ్ల వరకూ వ్యాధి నిరోధక టీకాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు కూడా జరుగుతున్నాయన్నారు. కుక్క, పాము కాటుకు వ్యాక్సిన్‌లు, టిబి రోగులకు మందులతో పాటు పోషకాహారానికి నెలకు రూ.వెయ్యి చొప్పున ఆరు నెలల వరకూ ఆర్థిక సాయం, లేప్రసీ రోగులకు చికిత్స చేసి గ్రామాల్లో సంక్రమిత, అసంక్రమిత, అంటువ్యాధులను తొలి దశలోనే గుర్తించి చికిత్సలు అందించేందుకు వైద్య సిబ్బందితో సర్వేలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో లభించు సేవలు, పాటిస్తున్న నాణ్యత ప్రమాణాలు, అత్యుత్తమ సేవలందించడంలో మెరుగైన ప్రదర్శనల వల్ల జనవరిలో రాష్ట్రంలోనే పశ్చిమగోదావరి జిల్లా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. అనంతరం వైద్యాధికారులను, వైద్య సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

ఉపాధి పనులపై సమీక్ష

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉపాధి హామీలో జిల్లా మొదటి స్థానంలో నిలిచే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఫీల్డ్ అసిస్టెంట్లకు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకపక్క కూలీలకు నూరు శాతం పని కల్పిస్తూ మరో పక్క గ్రామాభివృద్ధి చేసే విధంగా ఉపాధి హామీ చట్టంలో పనులు ఉండాలని సూచించారు. ఇప్పటికే ఈ చట్టంలో పలు సీసీ రోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణం చేశామని, రాబోయే రోజుల్లో ప్రభుత్వ పథకాలు మరింత శరవేగంగా చేసే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేయాలని సూచించారు. ముందుగా నవాబుపాలెం, కృష్ణపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కూలీలందరికీ 300 రూపాయలు కనీస వేతనం అందే విధంగా పని కల్పించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. కూలీలకు అన్ని వసతులూ ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు మద్దుకూరి గంగాభవాని ధనరాజ్, బేతపూడి వెంకటేశ్వరరావు, జనసేన మండలాధ్యక్షుడు అడపా ప్రసాద్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు కోరారు. శుక్రవారం ఆయన మున్సిపల్ కమిషనర్ బి.విజయ సారథితో కలిసి పనులను పరిశీలించారు. పట్టణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉద్యానవనం, అబ్దుల్ కలాం హెల్త్ పార్క్, కైలాసవనం అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి వివరాలు అడిగారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ దాసిరాజు

వార్డుల్లో కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని పలు వార్డుల పరిధిలో ప్రధాన డ్రెయినేజీలను ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ నిర్మలాకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మురుగు సమస్యలు లేకుండా ప్రతి రోజూ డ్రెయినేజీ శుభ్రం చేసే పనులు చేపట్టాలన్నారు. మురుగు నీరు లేకుండా చేయడం వల్ల దోమల సమస్య రాదని, ప్రజలు అంటు రోగాలబారిన పడకుండా ఉంటారని తెలిపారు. డ్రెయినేజీల్లో చెత్తాచెదారం, కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు వేయకుండా ఉండాల్సిన బాధ్యత స్థానికులపై ఉందన్నారు. అనంతరం పబ్లిక్ హెల్త్ వర్కర్ల హాజరు పట్టికను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్, పాత్రుడు, శానిటరీ మేస్త్రీ కిషోర్, నరేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఎలుకల మందు పంపిణీ

ప్రజాశక్తి - ఉండి

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఉచితంగా అందించే బ్రోమో డయోలిన్ మందును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆకివీడు సహాయ వ్యవసాయ సంచాలకులు కెఎస్ఎస్.శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి బి.సంధ్య అన్నారు. శుక్రవారం ఉండి రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు నారుమడి వేసి పంట కోత కోసే వరకూ అనేక దశల్లో ఎలుకలు విపరీతమైన నష్టాన్ని మిగులుస్తున్నాయని తెలిపారు. ఎలుకల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ ప్రభుత్వంచే ఉచితంగా అందిస్తున్న బ్రోమో డయోలిన్ మందును రెండు శాతం తీసుకుని అందులో 96 శాతం నూకలు, రెండు శాతం నూనె కలిపి చిన్న చిన్న పొట్లాలుగా తయారుచేసి పంట పొలాలు, కాలువ గట్ల మీద బొరియల్లో పెట్టి మట్టితో పూడ్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు పోలుబోతు రాము, ఇల్లాపు అప్పాజీ, గ్రామ వ్యవసాయ సహాయకులు జె.ఆల్ఫ్రెడ్ పాల్గొన్నారు.

ఆకివీడు : వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం ప్రతి గ్రామంలోనూ ఎలుకల మందులు రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. మండలం మొత్తానికి 33 కేజీల మందు అందజేసినట్లు మండల వ్యవసాయ అధికారి ఎ.ప్రియాంక తెలిపారు. ఈ మందును శుక్రవారం ప్రతి కార్యాలయం వద్దా నూకల మిశ్రమంతో కలిపి తమ సిబ్బంది రైతులకు అందజేశారని తెలిపారు. ఆ మేరకు ఆకివీడులో తానే స్వయంగా మిశ్రమాన్ని తయారు చేయించి పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు.

పెనుమంట్ర: మండలంలోని వ్యవసాయ శాఖ ద్వారా అన్ని రైతు సేవా కేంద్రాల్లో, గ్రామ సచివాలయాల వద్ద సామూహిక ఎలుకల నిర్మూలనా కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి అడబాల జ్యోషిలా శుక్రవారం తెలిపారు. మండలంలో మొత్తం 61 కేజీల బ్రోమో డయోలిన్ 0.25 శాతం ఎలుకల మందును ఉచితంగా రైతులకు పంపిణీ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాయలంలో కొండచిలువ

ఆందోళనలో స్థానికులు

భీమవరం టౌన్:రాయలంలో కొండచిలువ తిరుగుతుండడంతో స్థానికులు, రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు మూడు నెలల నుంచి రాయలం గ్రామ పరిధిలో అన్నాకోడేరు కాలువ గట్టు వెంబడి తరచూ కనిపించడంతో వరి, పాడి రైతులు, స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా కాలువ గట్టు ఇరువైపులా చెట్లు ఎక్కువగా ఉన్నాయి. అయితే విద్యార్థులు, కొత్తగా పెళ్లి నిచ్చయమైనవారు ఫొటో షూట్ల కోసం ఇక్కడికి వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఈ కొండ చిలువ ఎవరి మీద దాడి చేస్తుందో అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండచిలువను పట్టుకొని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టాలని గ్రామస్తులు ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.

ఘనంగా ఆలయ, విగ్రహ పున:ప్రతిష్ట

కాళ్ల:కలవపూడి గ్రామస్తుల సహకారంతో సుమారు రూ.2 కోట్లతో ఉమా భీమేశ్వరస్వామి ఆలయ పున:నిర్మాణం చేయడం అభినందనీయమని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘు రామకృష్ణంరాజు అన్నారు. కలవపూడిలో ఉమా భీమేశ్వర స్వామి వారి ఆలయ పున:నిర్మాణం, విగ్రహ పున్ణప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రఘు రామకృష్ణంరాజు హాజరై ప్రత్యేక పూజలు చేసి మాట్లాడారు. శిథిలావస్థకు చేరిన దేవాలయాన్ని గ్రామస్తులందరూ తమవంతు సహకారం అందించి దేవాలయాన్ని అద్భుతంగా నిర్మించారన్నారు. కలవపూడి గ్రామ స్ఫూర్తితో మిగతా గ్రామాల్లో కూడా దేవాలయాల పునర్నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఐఐసి ఛైర్మన్, మాజీ ఎంఎల్ఎ మంతెన రామరాజు, మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు, జుత్తిగ నాగరాజు, మంతెన పెద్ద నరసింహరాజు పాల్గొన్నారు.

గణపవరంలో ఫ్రైడే డ్రైడే

గణపవరం : గణపవరం పిహెచ్సి పరిధిలోని అన్ని సచివాలయాల వద్దా శుక్రవారం వైద్య సిబ్బంది ఫ్రైడే డ్రైడేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్బాబు మాట్లాడారు. ప్రతి శుక్రవారమూ ఫ్రైడే డ్రైడే పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో తడి లేకుండా జాగ్రత్తలు తీసుకుంటే దోమలు కుట్టకుండా ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం ఎస్.సముద్రావేణి, హెల్త్ అసిస్టెంట్లు జి.శ్రీను, ఎ.కృష్ణ, 104 సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు మొయ్యేరులో శుక్రవారం యాంటీ లార్వా మందు స్ప్రే చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి దూళ్ల కుటుంబరావు మాట్లాడుతూ గ్రామంలోని అన్ని వార్డుల్లో పారిశుధ్య నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా చెత్తాచెదారాలు తొలగించి దోమలు నివారణకు యాంటీ లార్వా మందును అన్ని ప్రాంతాల్లో సిబ్బంది స్ప్రే చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిప్పర పిహెచ్సి ఆరోగ్య విస్తరణ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు అరెస్ట్

లక్షా 80 వేల విలువైన బంగారం, వెండి స్వాధీనం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

నేరాలు - ఘోరాలు

తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,80,000 విలువ చేసే బంగారం, వెండి రికవరీ చేసినట్లు భీమవరం డిఎస్పి ఆర్.జైసూర్య తెలిపారు. ఈ మేరకు వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ నెల ఎనిమిదో తేదీన వన్టౌన్ పరిధిలోని మెంటేవారితోటకు చెందిన ఆర్.అంజనేయులు ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగల గొట్టి ఉండడంతో వన్టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై సిఐ నాగరాజు, సిసిఎస్ సిఐ రాంబాబు, ఎస్ఐ కిరణ్కుమార్ ఆదేశాల మేరకు డి.ఎస్.పి పర్యవేక్షణలో విచారణ చేపట్టగా తణుకు పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన నగరపు ఈశ్వరరావు, తణుకు మండలం పాతూరు గ్రామానికి చెందిన తంబాళ్ల శ్యామ్కుమార్లను 20వ తేదీ సాయంత్రం మెంటేవారితోటలో అరెస్టు చేసినట్లు తెలిపారు. వారు దొంగతనం చేసిన సొత్తు విలువ రూ.1,80,000 ఉంటుందని తెలిపారు. సమావేశంలో సిఐలు నాగరాజు రాంబాబు, ఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ కెవిఎస్ఎన్ వి.ప్రసాద్, కానిస్టేబుళ్లు రామకృష్ణ, వి.శ్రీనివాస్ పాల్గొన్నారు. దర్యాప్తులో పాల్గొన్న వారిని డిఎస్పి అభినందించారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడు అరెస్ట్

తాడేపల్లిగూడెం :తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఇ.స్వరాజ్య లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ మురళీమోహన్, దొరబాబు, సిబ్బందితో కలిసి వెంకటరామన్నగూడెంలో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుండి 8 మద్యం సీసాలను స్వాధీన పరచుకున్నట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

దొంగ నోట్ల ముఠా అరెస్ట్

నకిలీ కరెన్సీ స్వాధీనం

తాడేపల్లిగూడెం:దొంగ నోట్లు చలామణి చేస్తున్న 9 మంది ముఠాను అరెస్ట్ చేసినట్లు డిఎస్పి ధర్మవరపు విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ఉంగుటూరు మండలం నాచుగుంట గ్రామానికి చెందిన పులపాక సాంబశివ మరో కొంతమందితో కలిసి దొంగ నోట్లు మారుస్తూ చలామణి చేస్తున్నారని సమాచారం అందుకున్న తాడేపల్లిగూడెం సిఐ ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు పి.నాగరాజు, బాదం శ్రీను, పోలీస్ సిబ్బందితో కలిసి గురువారం రాత్రి దాడులు నిర్వహించి ఉంగుటూరు రెడ్డి సూర్య కాంప్లెక్స్ వద్ద ఇరువురు ముద్దాయిలను, ఏపూరు గ్రామ నూజివీడు రోడ్డు వద్ద మరో ముగ్గురిని అరెస్టు చేసినట్లు తెలిపారు వారి వద్ద నుంచి రూ.1.76 లక్షల విలువైన 352 నకిలీ రూ.500లు కరెన్సీ నోట్లు, కంప్యూటర్, సిపియు, కలర్ ప్రింటర్, బ్లాక్ అండ్ వైట్ ప్రింటర్, ఐరన్ బాక్స్, గ్లాస్ కట్టర్, 9 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నరసాపురం: నరసాపురంలో దొంగ నోట్లు ముద్రిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతను ఉపయోగించిన సెక్యూరిటీ నోట్లు, ప్రింటర్ స్వాధీనం చేసుకున్నట్లు పట్టణ సిఐ బి.యాదగిరి తెలిపారు. శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్లో సిఐ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారుల సమాచారం మేరకు పట్టణంలో 17 వార్డు రాయపేటకు చెందిన మహ్మద్ ఇబ్రహీం ఖాన్ ఇంట్లో తనిఖీలు చేసినట్లు తెలిపారు. తనిఖీలో ప్రింటర్, సెక్యూరిటీ పేపర్లు స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. దీనిపై సెంట్రల్ ఇంటెలిజెన్స్ అధికారి సాయి నాగ భూషణం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు సిహెచ్.జయలక్ష్మి, ఎస్.నాగ ముత్యాలరావు పాల్గొన్నారు.

నత్తనడకన కొమరాడ రోడ్డు పనులు..!

స్థానికుల అవస్థలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయని పలువురు విమర్శిస్తున్నారు. అయితే ఎన్నికల్లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారులను అభివృద్ధి చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలైనా నేటికీ రోడ్డు నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని కొమరాడ రోడ్డు ప్రాంతవాసులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో స్థానిక బలిసిముడిలో ఆదిత్య కాలేజీ నుంచి, అన్నాకోడేరు వరకూ 5.8 కిలో మీటర్ల మేర రూ.2 కోట్ల 76 లక్షలతో కొమరాడ సెంటర్లో 3.00 మీటర్లు సీసీ రోడ్డు, అలాగే అన్నాకోడేరులో 25.0 మీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మించారు. మిగిలిన దానికి బిటి రోడ్డు వేసేందుకు పనులు ప్రారంభించారు. ఈ పనులు 2024 డిసెంబర్ నాటికి పూర్తి కావాల్సి ఉండగా నేటికీ పూర్తికాకపోవడంపై ఆ ప్రాంతం వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ రహదారి గుండా నిత్యం ఎంతోమంది రాకపోకలు సాగిస్తుంటారు. ముఖ్యంగా ఎల్విఎస్.పురం, అన్నాకోడేరు, తుమ్మగుప్ప, కొమరాడ గ్రామ ప్రజలు వివిధ పనులపై నిత్యం భీమవరం పట్టణ కేంద్రం వచ్చి వెళ్తుంటారు. అంతేకాకుండా స్కూల్ బస్సులు కూడా నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ రహదారి పొడుగునా చేపలు, రొయ్యల చెరువులు ఎక్కువగా ఉండడంతో మేతల లోడుతో లారీలు వెళుతుంటాయి. అయితే ఈ రహదారి గుండా పెద్ద ఎత్తున గోతులు పడడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని ప్రధాన కారణం అధికారులు నిర్లక్ష్యమని, కనీసం మరమ్మతులు కూడా చేపట్టకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. నిధులు కేటాయించి పనులు చేపట్టిన తర్వాత పనులు పూర్తి చేయాల్సిన అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రహదారి పనులు వేగవంతం చేయాలని, జిల్లా అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న కొమరాడ రోడ్డు

తాగునీటి చెరువు తవ్వకం పనులు ప్రారంభం

ప్రజాశక్తి - ఉండి

ప్రతి ఒక్కరికీ స్వచ్ఛ జలాన్ని అందించడమే లక్ష్యంగా తాగునీటి చెరువు తవ్వకం పనులు ప్రారంభించడం జరిగిందని పాములపర్రు గ్రామ సర్పంచి కేశన శాంతికుమారి బలుసులరావు అన్నారు. శుక్రవారం పాములపర్రు గ్రామంలోని మంచినీటి చెరువు పూడుకుపోవడంతో తవ్వకం పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ తమ గ్రామంలోని మంచినీటి చెరువును సుమారు 40 సంవత్సరాల క్రితం తవ్వడం జరిగిందని, నాటి నుంచి నేటి వరకూ పూడికతీత పనులు నిర్వహించకపోవడంతో స్వచ్ఛ జలాలను గ్రామ ప్రజలకు అందించడంలో గత పాలకులు విఫలమయ్యారన్నారు. 25 సంవత్సరాలుగా తమ గ్రామానికి ఉండి ప్రధాన పంట కాలువ నుంచి వచ్చే నీరు మురుగ్గా ఉంటుందని, మరుగుదొడ్ల పైపులు డ్రెయినేజీ పైపులు కాలువలోనే ఉండడంతో తమ గ్రామానికి స్వచ్ఛమైన నీరు అందలేదని, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు దృష్టికి తీసుకెళ్లగానే సమస్య పరిష్కారం అయ్యిందని, తద్వారా నేడు చెరువు తవ్వకం పనులు ప్రారంభించి ప్రతి ఒక్కరికీ శుద్ధి జలాలను అందించడం జరుగుతుందని తెలిపారు. అభివృద్ధికి సహకరిస్తున్న రఘు రామకృష్ణం రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ అధ్యక్షులు కేశన యాదగిరి, సీనియర్ నాయకులు తోట శ్రీరాములు, నక్కా వెంకప్ప, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న సర్పంచి

జెఇఇలో భాష్యం విద్యార్థుల ప్రతిభ

తణుకు:జెఇఇ మెయిన్స్లో సెషన్-1 ఫలితాల్లో తణుకు భాష్యం స్కూల్లో 10వ తరగతి వరకూ, ఇంటర్ భాష్యం జూనియర్ కాలేజ్ గుంటూరులో చదివిన పి.కార్తీకహేమంత్రెడ్డి 96.44 శాతం, పి మహాలక్ష్మి 96.24 శాతం, పి బిందువర్షిణి 95.72 శాతం సాధించినట్లు తణుకు భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ ఎ.శ్రీమన్నారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, ప్రిన్సిపల్ ఎ.శ్రీమన్నారాయణరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ జివి పాండురంగారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

'రాజశేఖరం విజయమే లక్ష్యం'

ఉండి: ఉభయగోదావరి జిల్లాల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయమే లక్ష్యంగా టిడిపి మండల అధ్యక్షులు నాగరాజు ఆధ్వర్యంలో కూటమి నాయకులు శుక్రవారం సాయంత్రం ప్రచారం నిర్వహించారు. డిసి ఉపాధ్యక్షులు మంతెన సాయి లచ్చిరాజు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, యూనిట్ ఇన్ఛార్జి గురుగుబిల్లి సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నింటా రాణించాలి

భీమవరం టౌన్:చదువుతోపాటు ఓవరాల్ డెవలప్మెంట్పై దృష్టి సారిస్తేనే విద్యార్థులు ఏ గ్రూప్ అయినా అనుకున్న లక్ష్యాలు అందుకోగలరని, భీమవరం ఎస్ఆర్కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల, పూర్వ విద్యార్థి ప్రముఖ అంతర్జాతీయ సంస్థ వాల్ మార్ట్ మేనేజర్ సిహెచ్.దేవానంద్ గురు ప్రసాద్ విద్యార్థులకు నొక్కి చెప్పారు. కళాశాల ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్టిఇ) విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరుగుతున్న 'నిపుణ 25' జాతీయస్థాయి విద్యార్థి సింపోజియంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఐఎస్టిఇ ఫ్యాకల్టీ అడ్వయిజర్ డాక్టర్ ఎస్.రామ్గోపాల్రెడ్డి అధ్యక్షత వహించారు. వాల్ మార్ట్ మేనేజర్ దేవానంద్ గురు ప్రసాద్ మాట్లాడుతూ తాను విద్యార్థి దశలో ఐఎస్టిఇ కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకోగలిగాను అన్నారు. ప్రతి విద్యార్థి తనలోని బలహీనతలు అధిగమిస్తే లక్ష్యాన్ని చేరుకోగలమన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి.మురళీకృష్ణంరాజు మాట్లాడారు. ఐఎస్టిఇ విద్యార్థి చాప్టర్ ఫ్యాకల్టీ అడ్వయిజర్ ఎస్.రామ్ గోపాల్ రెడ్డి మాట్లాడారు. వి.పవన్సాయి, నాగేంద్ర, ఎస్.కైవల్య, పి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక శ్రీఅద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాలలో తెలుగు విభాగం, కళాశాల ఐక్యూ ఎసి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాతృభాష విశిష్టత అంశంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలువురు భాషావేత్తలు, విద్యావేత్తలు, రచయితలు, సాంస్కృతిక ప్రముఖులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ మాతృభాష మన సంస్కృతికి, గుర్తింపునకు మూలం అన్నారు. మాతృభాష ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడం కోసం ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యఅతిథి ఆచార్య వెలువోలు నాగరాజ్యలక్ష్మి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు కవితలు, గేయాలు, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఐక్యూ ఎసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం, ఐఐసి కన్వీనర్ ఎం.రామకృష్ణ, తెలుగు అతిథి అధ్యాపకురాలు కె.జ్యోతి పాల్గొన్నారు.

తణుకు : సాహితీ సామ్రాజ్యం ఆధ్వర్యంలో స్థానిక నం : 3 ప్రాథమిక పాఠశాల ప్రాంగణం వద్ద అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం, సాహితీ సామ్రాజ్యం తృతీయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీ సామ్రాజ్యం అధ్యక్షులు తాడినాడ భాస్కరరావు మాట్లాడుతూ మాతృ భాష సంస్కృతికి ప్రతిరూపం అన్నారు. ప్రధానోపాధ్యాయులు జీడిగుంట రాజ్కుమార్ మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు తెలుగు భాషపై పాటల పోటీలు, విచిత్ర వేషాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అలాగే ప్రధానోపాధ్యాయులు జీడిగుంట రాజ్కుమార్, కవి, రచయిత పెండ్యాల వెంకటేశ్వరరావు, వెల్ఫేర్ సెక్రటరీ ముత్యం సురేష్, పేరెంట్స్ ఛైర్మన్ చిట్టూరి కుమారిలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కట్టా అంజిబాబు, కొడవటి సునీల్ప్రదీప్, కొల్లేపర నాగసతీష్, కామాక్షి, సుహాసిని, అనిశెట్టి వెంకటలక్ష్మి, ఖండవల్లి లక్ష్మీశ్రావణి, ముక్కామల మోహనరావు పాల్గొన్నారు.

ఎస్కెఎస్డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్) తణుకులో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యు.లక్ష్మీసుందరీబాయ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మన మాతృ భాషను వ్యవహార భాషగా మలుచుకోవాలన్నారు. తెలుగు అధ్యాపకులు పి.శివప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో కెవి.శ్యామలాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకివీడు : జ్ఞానసౌధ నిర్మాణానికి మాతృభాషే పునాదని కవి, శతకపద్యకర్త, తెలుగు భాషోపాధ్యాయులు పెంకి విజయకుమార్ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు దుంపగడప జెడ్పి హైస్కూల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్టిహెచ్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విజయ కుమార్ ప్రధాన వక్తగా పాల్గొని మాట్లాడారు. మన మాతృభాష తెలుగును పరిరక్షించుకోవాల్సిన బాధ్యత తెలుగు వారందరిపైనా ఉందన్నారు. సభలో మరి కొంతమంది విద్యార్థులు విభిన్న ప్రధానాంశాలు, నైతికతగల పద్యాలను, కథలను పఠనం చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలాగే అజ్జమూరు ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు.

మొగల్తూరు : ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జెడ్పి ఉన్నత పాఠశాలలో భాషా పండుగ వేడుకలను మూడు రోజులుగా ఘనంగా నిర్వహించారు. మూడో రోజు శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయులు పెనుమత్స రామరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు నాటకాలు, పలు సంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

ఆధార్ నమోదు వేగవంతం చేయాలి : కలెక్టర్

భీమవరం :పిల్లలకు కొత్త ఆధార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి ఆధార్ మోనిటరింగ్ కమిటీ (డిఎల్ ఎఎంసి) ఛైర్మన్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆరేళ్ల పిల్లలకు జనన ధృవీకరణ పత్రాలు లేని వారికి వెంటనే దరఖాస్తులు పెట్టించి ఆధార్ న్యూ ఎన్రోల్మెంట్స్ నూరు శాతం జరిగేటట్లు చర్యలు తీసుకోవాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లాలో 2,164 మంది ఆరేళ్లలోపు పిల్లలు ఇంకా నూతన ఆధార్ నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. ఐదు నుంచి ఏడేళ్ల మధ్యలో మొదటిసారి, 15 నుండి 17 ఏళ్ల మధ్య రెండోసారి బయోమెట్రిక్ అప్డేట్ తప్పనిసరి అని తెలిపారు. ఇలా అప్డేట్ చేసుకోకపోతే నీట్, జెఇఇ పరీక్షలకు ఆధార్ అప్డేట్ గాక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. జిల్లాలో జీరో 5 నుండి 7 ఏళ్ల మధ్యలో మొదటిసారి 49,537 మంది పిల్లలు, 15 నుండి 17 ఏళ్ల మధ్యలో రెండో సారి 64,087 మంది పిల్లలు ఆధార్ అప్డేట్ చేసుకోవాల్సిన వారిలో మొత్తం 1,13,624 మంది పిల్లలు ఉన్నారని, తప్పనిసరిగా ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్ చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, కెఆర్ఆర్సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా స్త్రీ, శిశుసంక్షేమ శాఖ అధికారి బి.సుజాతరాణి, డిఇఒ ఇ.నారాయణ, డిఎంఅండ్హెచ్ఒ బి.భాను నాయక్ పాల్గొన్నారు.

ఆదిత్యలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

స్థానిక దిరుసుమర్రు రోడ్డు వద్ద గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో తలసేమియా బాధితుల సహాయార్థం రక్తదాన శిబిరాన్ని ఆదిత్య విద్యా సంస్థలు డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు భీమవరం ప్రభుత్వాసుపత్రి డాక్టర్ కిరణ్మయి టెక్నికల్ సిబ్బందితో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కమలాకర్ మాట్లాడుతూ యువత రక్తదానం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి, ఎన్ఎస్-ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ పి.కళ్యాణ్, అధ్యాపక, అధ్యాపకేతర, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రీసర్వే పారదర్శకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - నరసాపురం

రీ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఆర్డిఒ దాసి రాజు సూచించారు. మండలంలోని మల్లవరంలో చేపట్టిన రీసర్వేలో భాగంగా శుక్రవారం గ్రౌండ్ ట్రూథింగ్ నిర్వహించారు. ఆ పనులు పరిశీలించిన ఆర్డిఒ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రైతుల భూములకు కచ్చితమైన హద్దులు గుర్తించి ప్రయోగాత్మకంగా రీ సర్వే నిర్వహించటం జరుగుతుందన్నారు. సర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. సర్వే నిర్వహించే ముందు భూ యజమానులకు తెలియజేయాలని, వారి సమక్షంలోనే సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులకు ముందుగా సమాచారం అందించిన తర్వాతే సర్వే నిర్వహించాలన్నారు. దస్తావేజుల్లో తప్పులుంటే సరిచేయాలని సూచించారు. రీసర్వే పనులకు సంబంధించి రైతులు అధికారులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి, ఆర్ఐ లక్ష్మీ నారాయణ, విఆర్ఒ లక్కు స్వామి పాల్గొన్నారు.

విషపు ఎర మందును వినియోగించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పాలకోడేరు

రైతులు సామూహిక ఎలుకల నివారణకు విషపు ఎర మందును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. శృంగవృక్షం గ్రామంలో ఆమె సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమాన్ని రైతులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విషపు ఎర (ఎలుకల నివారణ మందు) మందును 20 ఏళ్లుగా వ్యవసాయ శాఖ రైతులకు ఉచితంగా అందజేస్తుందన్నారు. జిల్లాకు 1,120 కేజీల బ్రోమాడియోలోన్ మందును సరఫరా చేశారని, దీనికి నూక, వంట నూనె కలిపి మిశ్రమం తయారు చేసి రెండు లక్షల ఎకరాలకు రైతులకు అందజేస్తున్నామని తెలిపారు. స్థానిక మహిళలు గ్రామంలోని తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్ స్పందించి సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ అధికారులు క్షేత్రస్థాయిలోకి వెళ్లి పరిశీలించి, సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి సమస్యకు కారణాలను నివేదిక రూపంలో తనకు అందజేయాలన్నారు.

సచివాలయ అధికారులు నిబద్ధతతో పని చేయాలి

గ్రామ సచివాలయాల సిబ్బందితో కలెక్టర్ నాగరాణి స్థానికంగా సమావేశమయ్యారు. ప్రస్తుతం సిబ్బంది ఏఏ విధులు నిర్వహిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. కేటాయించిన పనులను సకాలంలో నిబద్ధతతో పూర్తి చేయాలని ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకునేలా పర్యవేక్షించాలన్నారు. రక్తహీనత కలిగిన మహిళలు, బాలలు ఉండకూడదన్నారు. కార్యక్రమాల్లో భీమవరం ఆర్డిఒ కె.ప్రవీణ్కుమార్రెడ్డి, తహశీల్దార్ విజయలక్ష్మి, వ్యవసాయ శాఖాధికారి వి.నారాయణరావు, సహాయకులు వెంకట పావని, ఊర్మిళ, రాణి, సచివాలయాల సిబ్బంది, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంపద సృష్టిద్దాం

ఇన్ఛార్జి ఎంపిడిఒ వెంకటేష్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల వద్ద సంపద సృష్టించేందుకు కృషి చేద్దామని ఇన్ఛార్జి ఎంపిడిఒ ఎం.వెంకటేష్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం మండలం కృష్ణయ్యపాలెం, నవాబుపాలెం గ్రామాల్లో శుక్రవారం ఆయన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా చెత్త శుద్ధి చేయడం, వేరు చేయడం తడి, పొడి చెత్త విడదీసి సంపద సృష్టించే విధానాలు వివరించారు. కార్యక్రమంలో నాయకులు మద్దుకూరి ధనరాజు, బేతపూడి వెంకటేశ్వరరావు, కార్యదర్శులు హరి కిషోర్, ఎండి అహ్మద్, ఎంఆర్సిఎం.రవికిరణ్, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.